

# ఒక సంకల్పం... వికసించింది!

## ● యువ శాస్త్రవేత్తల అనూహ్య విజయం

## ● సీసీఎంబీ విద్యార్థులకు అంతర్జాతీయ గుర్తింపు

న్యూస్‌టుడే, హైదరాబాద్

ఏదో సాధించాలన్న తపన... చిన్నప్పుడే మదిలో రగిలిన కసి... సమాజానికి ఏదైనా చేయాలన్న బలమైన కోరిక... వారిని గెలిపించాయి. కుర్రమీసాల యవ్వనంలోనే ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తలుగా గుర్తింపు తెచ్చాయి. అలాగని వీళ్లేమీ స్థితిమంతుల పిల్లలు కాదు. పేదరికమే పునాదిగా ఎదిగిన కృషీవలురు. నగరంలోని సీసీఎంబీలో విత్తనాల క్లోనింగ్‌లో ప్రపంచంలో తొలిసారిగా అద్భుత విజయాన్నిమూటగట్టుకుని ఔరా! అనిపిస్తున్నారు.

**పదేళ్ల స్వప్నం...** దేశంలోనే ప్రఖ్యాత 'సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్‌బయోలజీ'లో ఇటీవల ఓ అరుదైన పరిశోధన వెలుగుచూసింది. స్త్రీ, పురుష పుప్పొడి రేణువుల ప్రమేయం లేకుండానే వాటిని ఫలదీకరణం చేయడం దీని ఉద్దేశం. దీంతో పదేళ్లుగా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలు కొలిక్కి వచ్చాయి. ఎలాంటి పరిస్థితిలోనైనా తగ్గని నిఖర దిగుబడి, చీడపీడలను తట్టుకోగల సామర్థ్యం, రసాయన ఎరువులు అక్కర్లేని పంట కోసం... డాక్టర్ ఇమ్రాన్ సిద్ధిఖీ నేతృత్వాన యువ శాస్త్రవేత్తలంతా కృషి చేసి అపూర్వ విజయం సాధించారు. అరాబిడోప్సిస్ (ఆవాల) గింజల్లో సరికొత్త ఎపోమిక్సిస్ (ఫలదీకరణ) విధానం ద్వారా నూతన హరిత విప్లవానికి తెర తీశారు. ఇది వ్యవసాయ రంగానికి ఊతమిస్తే ప్రపంచ వ్యాప్తంగా తిండి గింజల సమస్య సమసిపోతుంది. పేరున్న దేశాలు ఈ అంశంలో నిమగ్నమైనా... అంతిమ విజయం మన వాళ్లే దక్కించుకోవడం విశేషం. కాలిఫోర్నియా, ఫ్రాన్స్ దేశాల వారితో కలిసి ఈ పరిశోధనల్లో పాల్గొన్నారు. ప్రపంచంలోనే పేరున్న 'సైన్స్ జర్నల్'లో వీరి పరిశోధన పత్రాలు అచ్చయ్యాయి. నిజానికి... వీరెవరికీ కాన్వెంటు చదువుల్లేవు. రెక్కాడితేగాని పూట గడవని కుటుంబాలు... అరకొర వసతుల నడుమ పల్లెల్లోని సర్కారీ విద్యను అభ్యసించినవారే. వీరిలోని కొందరి కుటుంబాల్లో కనీసం ఒక్కరు కూడా డిగ్రీ చదువుకున్నవారు లేరట. యూత్ అనగానే... ఐటీ ఉద్యోగం, ఐదంకెల జీతం, వీకెండ్ పార్టీలు అనుకుంటారు చాలామంది. కానీ వీరు పుట్టిపెరిగిన నేపథ్యం... సమాజం కోసం, పేదల కోసం, అన్నదాతల కోసం ఆలోచించేలా చేసింది.

### అమ్మానాన్నలు కూలీలు

మా అమ్మ, నాన్న దినసరి కూలీలు. కుటుంబంలో నేను తప్పా ఇప్పటివరకు ఒక్క గ్యాడ్యుయేట్ కూడా లేరు. అక్షరాలు నేర్చుకున్న రోజుల నుంచే నాలో ఏదో తపన. ఏదైనా సాధించాలని. ఇప్పటికీ అంతే. మేము ఎలా చదవాలి? ఎలా బతకాలని సలహాలు ఇచ్చేవారూ లేరు. ఇంటర్‌లో ఉండగానే శాస్త్రవేత్తగా ఎదగాలన్న ఆకాంక్ష, కసి బాగా పెరిగింది. సీసీఎంబీలోకి వచ్చాక నా కలలు నిజమవుతున్నాయి. మోహన్ సహకారంతో 'ఎపోమిక్సిస్ ప్రాజెక్టు'లో పనిచేశా. జన్యు మార్పిడి పరిశోధనలోనూ నాకు భాగస్వామ్యం ఉంది. ఇది నా జీవితంలో తొలి విజయం. ఎంతో స్ఫూర్తి నిచ్చింది.

– గుగన్,
ప్రాజెక్టు అసిస్టెంట్

### అన్నదాతల కష్టాలు తీర్చాలని...

చిన్నప్పుడు మాకు కాస్త భూమి ఉండేది. అది ఆక్రమణకు గురైంది. తర్వాత ఇల్లు గడవం చాలా ఇబ్బందిగా మారింది. పెద్దన్నయ్య రాజేసింగ్ చిన్న వ్యాపారం చేస్తూ మమ్మల్ని చదివించారు. ఇంటర్ నుంచే సర్కారు ఉపకార వేతనంతో చదువుకున్నాను. ముఖ్యంగా సీఎస్ఐఆర్, ఐసీఎంఆర్ ఉపకార వేతనాలు నన్ను ఇప్పటివరకు చదివిస్తున్నాయి. బీహార్‌లో రైతుల ఆత్మహత్యలు నేటికీ ఉన్నాయి. అలాంటి విషయాలు తెలిసినప్పుడల్లా నాలో కసి మరింత పెరుగుతుంది. బాధవేస్తుంది. రైతుల కష్టాలు తీర్చే శాస్త్రవేత్త కావాలన్నదే నా ఆకాంక్ష.

– దీపేష్‌కుమార్ సింగ్, పీహెచ్‌డీ విద్యార్థి



సీసీఎంబీ శాస్త్రవేత్తలతో యువ పరిశోధకులు



పరిశోధనలో పాలుపంచుకుంటూ...

### పరిశోధనలో ముందడుగు...

–డాక్టర్ ఇమ్రాన్ సిద్ధిఖీ,
సీసీఎంబీ, శాస్త్రవేత్త

ప్రకృతిలోని కొన్ని మొక్కల్లో స్త్రీ, పురుష పుప్పొడి రేణువుల ప్రమేయం లేకుండానే ఫలదీకరణం జరగుతుంది. దీనిని ఆధారంగా అన్ని మొక్కల్లో ఇది ఎందుకు సాధ్యంకాదన్న కోణంలో పరిశోధన చేస్తున్నాం. యువ శాస్త్రవేత్తల కృషితో కీలక ఘట్టాన్ని పూర్తిచేశాం. ఇక్కడ చదువుకుని అమెరికాలో పరిశోధనలు చేస్తున్న మోహన్ ఎంతో సాయపడ్డాడు. ఈ ఆవిష్కరణను వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాం.

### ప్రకృతిపై ప్రయోగాలు

మాది మధ్యతరగతి కుటుంబం. అమ్మ బడిలో ఉపాధ్యాయిని. పాఠశాల విద్యను అభ్యసిస్తున్నప్పుడు సైన్స్ టీచరు అంటే చాలా ఇష్టం. క్రమంగా ఆ సబ్జెక్టుపై మమకారం ఏర్పడింది. ఎక్కువగా ప్రకృతిలో విహరించేవాడిని. చిన్నప్పట్నుంచే సొంతంగా మొక్కలపై ప్రయోగాలు చేసేవాడిని. ఎపోమిక్సిస్... నా పరిశోధనకు ఎంతో కీలకమైనది. 'మాలిక్యూలర్ అనాలిసిస్' చేశా. కొన్ని మొక్కలపై స్వీయ ఫలదీకరణ లక్షణాలుంటాయా అనే కోణంలో చాలా పరిశోధన చేశా. అది సఫలమైంది. జీవితంలో మరవలేని తొలి విజయమిది.

–జయేష్,
పీహెడీ విద్యార్థి







